సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



మొగులు.. గుబులు

ఆరుగాలం కష్టపడి పంటలు కాపాడుకుంటూ వస్తున్న రైతులకు వాన మొగులు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.


వివరాలు 8లో ▸



దొంగల హల్‌చల్

శివ్వంపేట మండలంలో దొంగలు హల్‌చల్ చేశారు. చెండికాంబ ఆలయంలో వెండి కిరీటం, హుండీ ఎత్తుకెళ్లారు.

వివరాలు 8లో ▸



కానరాని పచ్చదనం..

జహీరాబాద్ పట్టణంలోని పార్కులపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వైభవంగా చండీ యాగం



చండీ యాగం నిర్వహిస్తున్న భక్తులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బల్కంచెల్క (భక్తిధాం) తండాలో శనివారం లోక కల్యాణం కోసం అష్టమ మాస చండీ మహోత్సవం నిర్వహించారు. తండాలోని విశ్వ పాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి మూడ్ కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో ఈ యాగం చేపట్టారు. టీవీ ఆర్టిస్టు బ్రహ్మశ్రీ చంద్రమౌళీశ్వర శర్మ, ఔరంగాబాద్‌కు చెందిన వేదపండితులు అనుప్‌శర్మ, మందిర ప్రధాన అర్చకులు మనోజ్‌శర్మ నేతృత్వంలో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో రూప్‌సింగ్, రాములు, శంకర్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌నాయక్, కిషన్, జైల్‌సింగ్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: టీఎస్ యూటీఎఫ్ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం పట్టణంలోని సంఘం భవనం సమీపంలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కంబపురం అశోక్ మాట్లాడుతూ.. సంఘం ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, విద్యారంగ సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాటాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాద్ జాదవ్, జిల్లా కార్యదర్శులు ఏశప్ప, నర్సయ్య, మడుపతి నరేష్, నాయకులు హరిసింగ్, రాజు, రాములు, శ్రీరాంనాయక్, అప్పారావు, సర్దార్, అంజయ్య, శివకుమార్, ఏసుదాసు, విఠల్, సిద్దయ్య, రవీందర్, సైమన్, నర్సింలు, రవి, శ్యాంరావు, విజయపాల్ ఉన్నారు.

జోగినాథ జాతర ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

జోగిపేట(అందోల్): పట్టణంలోని జోగినాథ స్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ పూజారులు భద్రప్ప, సుజీత్, సిద్దప్ప ఆధ్వర్యంలో గణపతి పూజ, హోమంను నిర్వహించారు. మంజీర నది నుంచి ఆలయం వరకు పల్లకీ సేవ నిర్వహించారు. నది నుంచి తీసుకువచ్చిన నీటితో జోడు లింగాలకు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రథోత్సవ కమిటీ సభ్యులు పట్లూరి శేఖర్, చింతల సురేష్, రంగ సురేష్, అవుసలి బ్రహ్మయ్య, ఆకుల నాగయ్య, ఆవుసలి ప్రభాకర్, అరిగే రాములు, పట్లోళ్ల రవికుమార్, పడిగె మహేందర్, డాకూరి నాగరాజు, మత్స్య సహకార సంఘం సభ్యులు, జలగరి యాదగిరి, అల్లె యాదగిరి, అంతం శీను పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



సర్టిఫికెట్లతో విద్యార్థినులు

వట్‌పల్లి(అందోల్): బాలికలు విద్యార్థి దశలోనే వ్యాయామం, ఆత్మరక్షణ విద్యలు సాధన చేయాలని మండల పరిధిలోని పోతులబోగుడా మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లిక సూచించారు. పీఎం శ్రీ పథకం కింద పాఠశాలలో 3నెలలుగా విద్యార్థినులకు నిర్వహిస్తున్న మార్షల్ ఆర్ట్స్‌సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో 75 మందికి బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాదేక, విజయలక్ష్మి, పీడీ అరుణ, గౌస్, క్రిష్ణ, అనిల్, రాములు, నాగేష్, మాస్టర్లు మురళి, నవీన్, రాజు, సుప్రియ, భానుప్రియ, మాధవి, లావణ్య, స్పందన పాల్గొన్నారు.



ఇంటికో సైనికుడు

ఆర్మీ అంటే వీరికి ప్రాణం

యాభై కుటుంబాలతో చూడటానికి చిన్న గ్రామమైనా.. ఆదర్శంలో మాత్రం పెద్దది. దేశ సేవకోసం మేము సైతం.. అంటూ ఆ గ్రామ యువత కదిలారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా 25మందికిపైగా సైన్యంలో చేరి దేశ రక్షణలో తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. నేటి యువత కూడా సైన్యంలో చేరడానికి ఆసక్తి చూపుతోంది. ఇదీ.. మర్కూక్ మండలం గంగాపూర్ ప్రత్యేకత. ఇక్కడి ప్రజల జీవన విధానంపై ఈ ఆదివారం 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం మీకోసం..

సండే స్పెషల్

యెన్నెల్లి సురేందర్–గజ్వేల్



- ఊరు చిన్నది.. ఆదర్శం పెద్దది
- 50 కుటుంబాల్లో 25 మంది సైనికులే
- విభిన్నంగా వివాహ వేడుకలు
- వరకట్నానికి వ్యతిరేకం..
- 'రాజ్‌పుత్'ల సంస్కృతి, సంప్రదాయాలు అబ్బురం

రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల నుంచి ఎన్నో ఏళ్ల కిందట వచ్చిన 'రాజ్‌పుత్'లతో గంగాపూర్ గా ఆవిర్భవించింది. చాలా ఏళ్ల కిందట ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. ప్రస్తుతం 50కిపైగా రాజ్‌పుత్‌ల కుటుంబాలు ఈ గ్రామంలో ఉన్నాయి. 'రాజ్‌పుత్'లో దేశభక్తి ఎక్కువ. అందువల్లే ఇక్కడి యువత సైన్యంలో చేరుతుంటారు. ఇప్పటికే 25మంది సైన్యంలో పనిచేస్తుండగా.. కొందరు పదవీ విరమణ పొందారు. గ్రామానికి చెందిన పంచిగారి యశ్వంత్ సింగ్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తున్నారు. నోచోనియా భవానీసింగ్, పంచిగారి నరేష్‌సింగ్, పంచిగారి రూప్‌సింగ్, అత్తర్‌సుమ నర్సింగ్, జుగ్‌రాజ్ గణేష్‌సింగ్, నోస్‌వార్ గణేష్‌సింగ్, నోస్‌వార్ భవానీసింగ్, నోస్‌వార్ సత్యనారాయణసింగ్, రామ్‌చరణ్‌సింగ్‌లు ఆర్మీలో పనిచేస్తున్నారు.

వ్యవసాయమే జీవనాధారం

వ్యవసాయమే వీరికి జీవనాధారం. తాతముత్తాతల నుంచి సంక్రమించిన భూమిలో సేద్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. యువత ఆర్మీలో చేరుతుండగా.. కొందరు స్థానికంగా కంపెనీలు, ఇతర ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. నిరుపేదలు ఏటా రైతుల వద్ద భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేస్తుంటారు. అలాగే కూలీపనులకు కూడా వెళ్తుంటారు.

రాజేంద్రనగర్ ఎస్‌ఐగా..

ఇదే గ్రామానికి చెందిన జుగ్‌రాజ్ నారాయణసింగ్ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. కాగా పంచిగారి రామ్‌సింగ్, అత్తర్‌సుమ అనంతరామ్‌సింగ్, నోచునోయి హిరామన్, అనంత రామ్‌సింగ్, అత్తర్‌సుమ రాజారామ్ సింగ్, ప్రకాష్‌సింగ్‌లు సైతం ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందారు. వీరే కాకుండా మరో ఏడుగురికిపైగా సైన్యంలో విధులు నిర్వహిస్తున్నారు. మరికొంత యువకులు ఇండియన్ ఆర్మీలో చేరడానికి ఉత్సాహంతో ఉన్నారు.

యూసుఫ్‌ఖాన్‌పల్లిలోనూ...

ఈ గ్రామానికి ఆనుకొని ఉన్న యూసుఫ్‌ఖాన్ పల్లిలోనూ మరో 20కుపైగా రాజ్‌పుత్‌ల కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామం నుంచి కూడా మరో 15మంది ఆర్మీలో పనిచేస్తున్నారు. మిగతావారు వ్యవసాయం, ఇతర వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గంగాపూర్ ప్రస్తుతం యూసుఖాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోకే వస్తుంది.

దేశ సేవంటే ఇష్టం



మా ఊరు ఇచ్చిన ప్రేరణతోనే నేను ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరాను. చిన్నప్పటి నుంచి నాకు దేశ సేవంటే మహా ఇష్టం. నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాను. మా గ్రామంలో చాలా మంది ఆర్మీలో పనిచేస్తుండటం ఆనందంగా ఉంది. మా ఊరే అందరికీ ఆదర్శం.

– పంచిగారి యశ్వంత్ సింగ్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, రాజస్థాన్

భిన్నంగా సంస్కృతీసంప్రదాయాలు..

గంగాపూర్‌లో నివాసముంటున్న 'రాజ్‌పుత్'ల సంస్కృతి, సంప్రదాయాలు కొంత భిన్నంగా ఉన్నాయి. వారు పెళ్లిళ్లు ప్రత్యేకంగా నిర్వహిస్తుంటారు. వారం రోజులపాటు మటియానా, రజయాగా, లగాన్, మండప్ చాస్, బరాత్, పెళ్లి, మడవజకయ్ పేర్లతో కార్యక్రమాలు జరుగుతాయి. కట్నకానుకలకు వీరు పూర్తిగా వ్యతిరేకం. వీరి ఆహారపు అలవాట్లు దాదాపు స్థానికుల మాదిరే. వేడుకల్లో మద్యం, మాంసాహారానికి తావుండదు. రాజ్‌పుత్‌లు ఇక్కడి ప్రజలతో కలిసిపోయి ఆత్మీయంగా జీవిస్తున్నారు.



రాజ్‌పుత్‌ల వివాహ వేడుక

ఆర్మీలో చేరడం గర్వంగా ఉంది



దేశ సేవ చేసేందుకు ఆర్మీలో చేరడం గర్వంగా ఉంది. 2023లో ఆర్మీలో చేరాను. మా గ్రామంలో నాతోపాటు ఎంతోమంది ఉన్నారు. వారి సలహాలు, సూచనలతో ఉద్యోగంలో చేరి సేవ చేస్తున్నాను.

– పంచిగారి నరేశ్ సింగ్, ఆర్మీ పైలెట్

శిక్షణ ఇస్తే మరింత మేలు



దేశ సేవ చేసే అదృష్టం ఆర్మీలో దక్కుతుంది. మా గ్రామం నుంచి ఎక్కువ మంది ఆర్మీలో చేరడం గర్వంగా ఉన్నది. వారి స్ఫూర్తితో ప్రతి ఏటా కొందరు యువకుల ఆర్మీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి వారికి శిక్షణ ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– దుర్గన్‌సింగ్, ప్రైవేట్ లెక్చరర్, గంగాపూర్

ఇక్కడివారితో కలిసిపోయాం



తాతముత్తాలు గంగాపూర్‌కు వచ్చారు. ఇక్కడే స్థిరపడ్డారు. ఇక్కడివారితో కలిసి పోయాం. వారే మాకు ఆత్మీయులు. ఏ వేడుక అయినా అందరం కలిసి చేసుకుంటాం. వ్యవసాయం జీవనాధారం. ఎంతోమంది పిల్లలు ఆర్మీలో చేరడం సంతోషం.

– శంకర్‌సింగ్, గంగాపూర్

పాలిచ్చే బర్రెను అమ్ముకోవద్దు

- పథకాలు లేక క్యాలెండర్లతో బీజేపీ ప్రచారం
- ఎన్నికల హామీలు అమలు చేయని కాంగ్రెస్
- ప్రజల బాధలు తెలిసిన వ్యక్తి వెంకట్రామిరెడ్డిని గెలపించండి
- సంగారెడ్డి యువ సమ్మేళనంలో హరీశ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

సంగారెడ్డి: పాలిచ్చే బర్రెలాంటి బీఆర్ఎస్‌ను నమ్ముకోవాలి కానీ.. అమ్ముకోవద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన యువ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీకి పథకాలు లేక క్యాలెండర్లతో ప్రచారం చేస్తుందన్నారు. ఎన్నికల హామీలు అందితే కాంగ్రెస్‌కు ఓటెయ్యొచ్చని.. లేదంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. దేశంలో 150 మెడికల్ కాలేజీలుంటే కేంద్రం తెలంగాణకు ఒక్కటైనా ఇచ్చిందా అని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకాయన్నారు. మతాలతో, సెంటిమెంట్లతో పాలిస్తున్నారని దుయ్యబట్టారు. దుబ్బాక బై ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి రఘునందన్ గెలిచారని వీడియో, ఆడియో క్లిప్పింగులు స్క్రీన్ ద్వారా చూపించారు. కాంగ్రెస్ చాలాచోట్ల డమ్మీ అభ్యర్థులను పెట్టి బీజేపీకి మద్దతు ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే యువతకు ఉచిత కోచింగ్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి దాని ద్వారా తాను చనిపోయిన తర్వాత కూడా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

పనిమంతుడు వెంకట్రామిరెడ్డికి పట్టం కట్టాలి

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: నమ్మి ఓట్లేస్తే కాంగ్రెస్, బీజేపీలు నట్టేట ముంచాయని హరీశ్‌రావు విమర్శించారు. శనివారం రాత్రి పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పటాన్‌చెరు ప్రాంతంలో గతంలో తాగునీటి గోస ఉండేదని, మిషన్ భగీరథ ద్వారా ఆ సమస్య తీర్చామని తెలిపారు. మహాలక్ష్మి పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తామన్న హామీని రేవంత్ మరిచిపోయాడని, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి 400 మందికి ఉచితంగా స్కూటీలు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. విదేశాల్లో నల్లధనం తీసుకువచ్చి పేదలకు పంచుతామని బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మాయ మాటలతో గెలిచిన రఘునందన్‌కు దుబ్బాకలో బుద్ధి చెప్పారన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో ఎలా చెల్లుతుందన్నారు. పనిమంతుడైన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఘన విజయం అందించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో పటాన్‌చెరు నుంచి లక్ష మెజారిటీ అందిస్తానని తెలిపారు. కేసీఆర్, హరీశ్‌ల సహకారంతో 9 ఏళ్లలో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నెల రోజులు నా కోసం పనిచేస్తే.. వచ్చే ఐదేళ్లు మీకు సేవ చేస్తా అని వెంకట్రామిరెడ్డి చెప్పారు. అధికారిగా పని చేశా, ఎంపీగా అవకాశం ఇస్తే సమస్యలపై గొంతు విప్పుతా అని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నావ్!

- ప్రజలపై విరక్తి చెందిందని అనలేదా జగ్గారెడ్డి?
- అధికార పార్టీల కోసం రంగులు మార్చడం నీ వైఖరి
- మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్



సదాశివపేటలో అభివాదం చేస్తున్న రఘునందన్‌రావు

సదాశివపేట(సంగారెడ్డి): పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఏం మాట్లాడుతాడో.. ఏ చేస్తాడో ఎవరికీ తెలియదని, ఆయనవన్నీ ఉడుత మాటలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సదాశివపేటలోని దుర్గాభవాని మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాంధీచౌక్ వద్ద నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగించారు. సదాశివపేటలో వెయ్యి ఇళ్ల పట్టాలిస్తానని, 5000 మందికి ఇళ్లు కట్టిస్తా అని జగ్గారెడ్డి అబద్ధపు హామీలు ఇస్తాడని పేర్కొన్నారు. అందులో ఏ ఒక్కటీ అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగానే ప్రజల మీద విరక్తి వచ్చిందని, వారిని వెలివేస్తున్నా అన్న జగ్గారెడ్డిని ప్రజలే వద్దనుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నావని ప్రశ్నించారు. బీజేపీ తరఫున కౌన్సిలర్‌గా, రెండు సార్లు మున్సిపల్ చైర్మన్‌గా గెలిచిన విషయం మరిచిపోయావా అని ప్రశ్నించారు. ఇప్పుడు బీజేపీ గురించి మాట్లాడవద్దని అనడం ఎంతవరకు సబమని నిలదీశారు. రాష్ట్రంలో అధికారంలో ఉండే పార్టీల కోసం జగ్గారెడ్డి ఊసరవెల్లి రంగులు మారుస్తాడని ప్రజలందరికీ తెలుసన్నారు.

రామ మందిరం నిర్మించి హిందువులు గర్వపడేలా ప్రధాని మోదీ చేశాడని రఘునందన్‌రావు వివరించారు. దేశంలోని ముస్లిం మైనార్టీ మహిళా సంక్షేమానికి సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ అంటూ త్రిబుల్ తల్లాక్ బిల్లు తీసుకొచ్చారని తెలిపారు. 370 ఆర్టికల్ రద్దు చేసి జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్గాభాగమని చాటిచెప్పిన ఘనత ప్రధానిదే అన్నారు. 50 దేవాలయాలు ఉన్న సదాశివపేట పట్టణం ఉమ్మడి మెదక్ జిల్లాలో టెంపుల్ సిటీగా మారడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఆలోచించి ఓటు వేసి తనను మెదక్ ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మెదక్ లోక్‌సభ కో కన్వీనర్ కోవూరి సంగమేశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా కార్యదర్శి మాణిక్‌రావు, శ్రీనివాస్, శ్రీశైలం, శ్రీకాంత్, తోట చంద్రశేఖర్, బగిలికర్ సంతోష్, శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న బీబీ పాటిల్

న్యాల్‌కల్(జహీరాబాద్): దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని జహీరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శనివారం న్యాల్‌కల్‌లో నిర్వహించిన సమావేశంలో న్యాల్‌కల్‌తో పాటు మల్గి, టేకూర్, మామిడ్గి తదితర గ్రామాలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400కుపైగా సీట్లు సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ పాటిల్, పాండురంగారెడ్డి, బస్వరాజ్ పాటిల్, దెొెట్టి పాటిల్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలుపునకు నాంది

నారాయణఖేడ్: మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీ గెలుపునకు సోపానాలని బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన యువకులు కాషాయం కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాతే భారత్ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ దేశాల్లో పెంపొందాయన్నారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను చూసి ప్రజలు మూడోసారి బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పైడి ఎల్లారెడ్డి, సంగప్ప, విజయపాల్‌రెడ్డి, రామకృష్ణ, అరుణ్ రాజ్, వీరమణి రాథోడ్, దశరథ్, రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

కల్హేర్(నారాయణఖేడ్): అకాల వర్షం రైతన్నకు కడగండ్లు మిగిల్చింది. కల్హేర్, నిజాంపేట, సిర్గాపూర్ మండలాల్లో శుక్రవారం రాత్రి, శనివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. బాచేపల్లి, మహదేవుపల్లి, ఇందిరానగర్, కృష్ణాపూర్, కల్హేర్, తదితర చోట్ల రోడ్లపై ఆరబోసిన జొన్న కంకులు, వరి ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. మహదేవుపల్లి వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ఆరబోసిన ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది. ధాన్యం నీటిలో కొట్టుకుపోకుండా రైతులు శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని రైతులు డిమాండు చేశారు.





మహదేవుపల్లి శివారులో కురిసిన వర్షానికి కొట్టుకుపోయిన వరి ధాన్యం

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

గజ్వేల్‌రూరల్: అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను శనివారం గజ్వేల్‌లో ఆ శాఖ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీఎఫ్‌వో (జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి) సురేశ్ కుమార్ మాట్లాడుతూ 'అగ్నిభద్రతను నిర్ధారించి.. దేశాభివృద్ధికి సహకరించండి' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. అవగాహన లోపం, నిర్లక్ష్యంతోనే అగ్నిప్రమాదాలు జరుగుతాయని, వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశాలున్నాయన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 101 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



అన్విత్ ప్రీతమ్

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రీయ మిలటరీ స్కూల్లో సీటు సాధించిన మెదక్ పట్టణ విద్యార్థి అన్విత్ ప్రీతంను పీఆర్టీయూ జిల్లాశాఖ శనివారం ఒక ప్రకటనలో అభినందించింది. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న ఐదు రాష్ట్రీయ మిలిటరీ స్కూళ్లలో 300 సీట్లకు జరిగిన ప్రవేశ పరీక్షలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి విద్యార్థి అన్విత్ ప్రీతమ్ సీటు సాధించడం హర్షణీయమని పేర్కొన్నారు. జిల్లా తరఫున సీటు సాధించిన ఏకైక విద్యార్థి కావడం గొప్ప విషయమన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో 399 ర్యాంకు సాధించి కోరుకొండ సైనిక్ పాఠశాలలో కూడా ఎంపికైనట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు,సెల్‌ఫోన్లు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరం పై శుక్రవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. సలాఖపూర్ గ్రామా శివారులోని ఓ పశువుల కొట్టంలో కొంత మంది పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.70 వేల నగదు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాసు ఇన్నారెడ్డి, విరుపాక మహేందర్ రెడ్డి, యిన్నం దినేశ్, రంజిత్‌రెడ్డి, మామిడి గోపికృష్ణ, దేవి భూపాల్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ Luxury Farm House For Sale at Moinabad, KethireddyPally, Fully Furnished, Ready to Occupy, North-East Facing & North Facing Plots at NRI Farms Venture Gated Community, Clear Tittle with Land Area 13.5 Guntas/1633 Square Yards, Agricultural Lands are also Available for Sale. Cont: 8555857167 [H-604847]

■ Independent houses for sale @Malkapur, Sangareddy. 141S/y 1100Sft top quality built-up, E/F with N-E Entrance. Ready to Occupy, Prime location, Bank loan avail Ph: 9063510400, 9391003272 [HA-97118]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph:9160900024/ 9640400073 [H-799868]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-799726]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185031]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మొగులు.. గుబులు

ఈ ఫొటోలో కనిపిస్తుంది దుబ్బాకకు చెందిన రైతు ఎంగారి నరేశ్ రెడ్డి. యాసంగిలో వేసిన 4 ఎకరాల వరి ఇంకో 15 రోజులైతే కోతకొచ్చేది. మొగుల్లు అవుతుండడంతో భయంతో 70 శాతం కూడా ఎర్రబడక ముందే కోయించాడు. వడగండ్ల వర్షం పడితే ఇత్తు చేతికిరాదు ఉన్న పంటన్నా చేతికొస్తే చాలనుకునే పచ్చిగా ఉన్నా కోయించాడు. వరి పొలం దిగబడుతుండడంతో ఎక్కువ డబ్బులు పెట్టి చైన్ మిషన్‌తో కోత కోశాడు. ఇలా ఒక్క నరేశ్ రెడ్డే కాదు చాలా మంది రైతులు మొగులు గుబులుతో నష్టమైనా పంటను కోయిస్తున్నారు.





దుబ్బాకలో వరి పంటను కోయిస్తున్న రైతు

- జిల్లా రైతులను భయపెడుతున్న మబ్బులు
- రెండు రోజులుగా చినుకులు..
- వర్షం పడితే వరి పంట ఆగమాగమే..
- నష్టమని తెలిసినా ముందే కోయిస్తున్న రైతులు
- పచ్చి వరిచేను కోతతో 20 శాతంకు పైగా నష్టం

దుబ్బాక: జిల్లాలోని రైతుల పరిస్థితి ముందు చూస్తే నుయ్యి.. వెనుక చూస్తే గొయ్యిలా తయారైంది. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి పంటలు కాపాడుకుంటూ వస్తున్న రైతులకు వాన మొగులు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. వరి పంటలు చేతికొచ్చే దశలో వారం రోజులుగా వాన మొగుల్లు అవుతుండడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. 20 రోజుల కిందట వడగండ్ల వానలు పడడంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లింది. మళ్లీ వానలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతోపాటు వాతావరణంలో సైతం మార్పులు రావడంతో రైతులు పచ్చి వరిపంట చేలనే కోస్తున్నారు. వరి గొలుసులు 70 శాతం వరకు కూడా సరిగ్గా ఎండుముఖం రాకముందే వర్షాల భయంతో కోయిస్తున్నారు.

ఉన్నదన్నా దక్కించుకోవాలని..

వడగండ్ల వర్షం పడితే గింజకూడ చేతికి రాదు.. ఉన్న పంటనన్నా దక్కించుకుంటే చాలనే రైతులు పచ్చి వరి పంటనే కోయిస్తున్నారు. భూమి ఆరక దిగబడుతుండడంతో ఎక్కువ వ్యయమైనా చైన్ మిషన్‌లను పెట్టి వరిపంటలు కోయిస్తున్నారు. సుమారుగా 20 శాతంకు పైగా గింజలు తాలుపోయి నష్టం జరిగే అవకాశాలు ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో కోయిసున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో 3.30 లక్షల ఎకరాల్లో వరి పంటలు వేయగా చాలా వరకు నీరందక పంటలు ఎండిపోయాయి. మొన్న కురిసిన వర్షానికి కొంత నష్టం వాటిల్లింది. మళ్లీ ఆకాశంలో మార్పులతో పూర్తిగా కాని చేలనే కోస్తుండడంతో చాలా వరకు పంటలకు నష్టం వాటిల్లినట్లే కనిపిస్తుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

10 రోజుల తర్వాత కోసేదుండే..



నేను 4 ఎకరాల్లో వరిపంట వేసిన. ఇంకో 10 నుంచి 15 రోజులైతే వరి పూర్తిగా కోతకొచ్చేది. వాన భయంతో ముందుగానే పచ్చిగా ఉన్న కోయించిన. కొంత పొల్లు పోయినా వాన పడితే ఇత్తు చేతికిరాదనే భయంతోనే కోయించిన. ఏం చేస్తాం బాకీ ఉన్న కాడికి అయితయి ఇంకా 10 రోజులు ఉంచితే చేతికొస్తదన్నా గ్యారంటీ లేదాయే. నేనే కాదు చాలా మంది పచ్చి చేలనే కోయిస్తుండ్రు.

– గన్నె వెంకట్రాజిరెడ్డి, రైతు

వాన పడితే చేతికిరాదు



20 రోజుల కిందటనే వరి ఈనుతున్న దశలోనే వడగండ్ల వర్షం పడే. మళ్లీ చేతికొస్తదనుకున్న సమయంలో మొగుల్లు కావట్టే మళ్లీ రాళ్లు పడితే పంట గింజ కూడ దక్కదు. పచ్చిగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో కోయించిన. యాసంగిలో పంట చేతి కొచ్చేది నమ్మకం లేదు పోయిన యాసంగిలో రాళ్లవాన పడి పంటచాల నష్టం జరిగింది. ఇప్పుడు మొగుల్లు అవుతుండడంతో 4 రోజుల కిందటనే పచ్చిచేనునే కోయించినా.

–పాతూరి లక్ష్మణ్, రైతు

పచ్చి చేలను కోస్తే నష్టం



వరి పంటలు పూర్తిగా ఎర్రబడక ముందే కోయడం వల్ల నష్టం వాటిల్లుతుంది. వరి గొలుసులు 85 నుంచి 90 శాతం వరకు ఎర్రబడ్డ తర్వాతనే పంటలు కోస్తే దిగుబడి మంచిగా వస్తుంది. వానల భయంతో రైతులు పూర్తిగా గొలుసు కాకముందే కోస్తుండడం వల్ల చాలా వరకు గింజలు తాలు పోయే పరిస్థితి ఉంటుంది. రైతులు పూర్తిగా గొలుసు ఎర్రబడక ముందే పంటలు కోసి నష్టపోవద్దు.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య



దీపక్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బచ్చేంద్రో దరువ కుటుంబంతో మండల పరిధి రూప్ల తండాలో ఇటుక బట్టి వద్ద కూలీ పని చేసేందుకొచ్చారు. అతడి చిన్న కొడుకు దీపక్ దరువ(21) మతి స్థిమితం సరిగా లేక మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యానికి డబ్బులు ఇవ్వమని తల్లితో గొడవపడి బయటకు వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు దీపక్ దరువ కోసం వెతకగా తండాకు సమీపంలోని పలుగు గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. మృతుడు తండ్రి బచ్చేంద్రో దరువ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తితో..



బాలయ్య మృతదేహం

చేగుంట(తూప్రాన్): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం జబ్బాపూర్ గ్రామానికి చెందిన పల్లపు బాలయ్య(37) చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీలోని మమతతో 10 ఏళ్ల కిందట వివాహమైంది. రెడ్డిపల్లి కాలనీలోనే ఉంటూ వ్యవసాయ పనులతోపాటు వడ్డెర వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాలయ్య కొద్దిరోజులుగా కుటుంబ, ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. శనివారం తెల్లవారు జామున బోండ్ల లక్ష్మణ్ వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

కుటుంబ కలహాలతో..

- కరెంటు స్తంభం ఎక్కిన యువకుడు
- సీఐ కేశవులు హామీతో కిందకు దిగిన వైనం



కరెంట్ స్తంభంపై దేవీసింగ్

హవేళిఘణాపూర్(మెదక్): కుటుంబ కలహాలతో ఓ యువకుడు కరెంట్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన దేవీసింగ్ కొంత కాలంగా కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్నాడు. గతంలో రెండుసార్లు భార్య కాపురానికి రావడం లేదని కొల్చారంలో విద్యుత్ స్తంభం ఎక్కాడు. శనివారం దేవీసింగ్ తన సమస్యను మెదక్ రూరల్ సీఐకు వివరించేందుకు కార్యాలయానికి రాగా, సీఐ అందుబాటులో లేడు. అనంతరం బయటకు వచ్చి కార్యాలయం ఎదుట గల విద్యుత్ స్తంభం ఎక్కి కూర్చునే క్రమంలో కరెంట్ షాక్ తగిలి స్వల్పంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐ కేశవులు ఘటనా స్థలానికి చేరుకొని నీ సమస్యను వారం రోజుల్లోపు పరిష్కరిస్తానని హామీనివ్వడంతో దేవీసింగ్ కిందకు దిగాడు. భార్య కాపురానికి రావడం లేదని రెండుసార్లు విద్యుత్ స్తంభం ఎక్కగా, తాజాగా శనివారం మెదక్‌రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఎక్కడం కుటుంబ కలహాలే కారణమైనట్లు పోలీసులు తెలిపారు.

దొంగల హల్‌చల్

ఆలయం, తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆలయంలో చోరీ చేస్తున్న దొంగ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. చెండి గ్రామంలోని చెండికాంబ ఆలయంలో అమ్మవారిపై ఉన్న 9 తులాల వెండి కిరీటం చోరీ చేయడంతోపాటు హుండీ ఎత్తుకెళ్లారు. ఆలయానికి కొద్ది దూరంలో హుండీ ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు వేసుకొని చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. శనివారం పోలీసులు, క్యాస్ టీమ్ సభ్యులు చోరీ ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

8 తులాల వెండి చోరీ

మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో శనివారం తెల్లవారుజామున తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన పంచాయతీ వాటర్‌మెన్ మదిర నాగరాజు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉన్న విషయాన్ని గుర్తించాడు. ఇంట్లోకి వెళ్లి చూస్తే చూడగా బట్టలు, పలు వస్తువులను చిందర వందరగా పడేసి రూ.5,500 నగదు, 8 తులాల వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు నాగరాజు తెలిపాడు. చోరీ ప్రదేశాన్ని పోలీసులు పరిశీలించారు.

కష్టాల్లో ఖలీల్

పొట్టకూటి కోసం అలుపెరగని పోరాటం ఆయనది. కన్ను కనిపించకపోయినా.. కాలు సరిగా పని చేయకపోయినా రోడ్లపై చిరు వ్యాపారం కొనసాగిస్తున్నాడు. గిరాకీ వచ్చిన రోజు పండుగ.. రాని రోజుల్లో పస్తులు ఉండక తప్పని దీనస్థితి. గత ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా అవేవీ ఆదుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా తన కష్టాలు తీరుతాయేమోనని ఎదురుచూస్తున్నాడు రేగోడ్ మండల కేంద్రానికి చెందిన ఖలీల్.



వ్యాపారం చేసుకోవడానికి వెళ్తున్న బుక్క ఖలీల్

పొట్టకూటి కోసం పోరాటం

- కనిపించని కన్ను, పని చేయని కాలు
- తప్పక రోడ్లపై చిరు వ్యాపారం
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

రేగోడ్(మెదక్): మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో బుక్క ఖలీల్ మియాది ఓ పేద కుటుంబం. సుమారు అరవై ఏళ్ల వయస్సు దాటింది. ఉన్నత విద్యాభ్యాసం చేయాలని ఉన్నా పరిస్థితులు అనుకూలించక పదవ తరగతితోనే చదువు ఆపేశాడు. చిన్నప్పటి నుంచి నడవలేని పరిస్థితి. 20 ఏళ్ల కిందట ప్రమాదవశాత్తు ఓ కన్ను చూపు కూడా పోయింది. తన స్తోమ తకు మించి ఎన్నో ఆస్పత్రులకు తిరిగినా తగ్గలేదు. 30 ఏళ్ల కిందట అదే గ్రామానికి చెందిన శరీఫా ఉన్నీసతో ఆయనకు పెళ్లయింది. భగవంతుడి దయతో తమ జీవితం బాగుంటుందని కలలుగన్న ఆ దంపతులకు దశాబ్దాల నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి.

భూమి లేదు.. ఇల్లు లేదు

ఖలీల్‌కు గుంట భూమి లేదు.. ఉండనీకి సొంత ఇల్లు లేదు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ఉన్ననాడే పండుగ.. లేనినాడు కడుపు కోతే. గత రాష్ట్ర ప్రభుత్వం ఖలీల్‌ను ఆదుకోలేదు. కనీసం దివ్యాంగుల జాబితాలో పెన్షన్ కోసం సుమారు నాలుగు మార్లు సదరం శిబిరాలకు వెళ్లినా ఇప్పటికీ ధ్రువపత్రం అందక పింఛన్ రాని పరిస్థితి వృద్ధాప్య పెన్షన్ జాబితాలో డబ్బులు వచ్చినా కుటుంబ పోషణకు ఇబ్బందులు తప్పడం లేదు.

వానొచ్చినా.. ఎండొచ్చినా..

ఖలీల్ భార్య శరీఫా ఉన్నీస కూలీ పనులకు వెళ్తోంది. ఖలీల్ రోడ్లపై తనకున్న దాంట్లో చిరు వ్యాపారం చేస్తున్నాడు. ఒక్కోమారు భార్య కూడా ఖలీల్‌తో వెళ్తుంది. కన్ను కనపడకపోయినా, కాలు సరిగా పనిచేయకపోయినా వానొచ్చినా.. ఎండొచ్చినా రోడ్లపై ఉండాల్సిందే. గిరాకీలు లేక విలవిలలాడుతున్నాడు. పెట్టుబడుల కోసం ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా మండలాల్లో ఏ రోజు అంగడి ఉంటే ఆ రోజు అక్కడికి వెళ్లి దుకాణం పెడుతున్నాడు. గిరాకీ ఉన్ననాడు పండుగ.. లేనినాడు పస్తులే.

ప్రభుత్వం ఆదుకోవాలి

కన్ను కనిపించదు, కాలు నడవడానికి రాదు. ఉండనీకి ఇల్లు లేదు, తిననీకి పూట గడవడం కష్టంగా ఉంది. సదరం క్యాంపులకు వెళ్లినా ఇప్పటికీ డాక్టర్ సర్టిఫికెట్ రాలేదు. చిన్న వ్యాపారం చేసినా పెట్టుబడికి, కుటుంబ పోషణకు కష్టంగా ఉంది. ప్రభుత్వం స్పందించి నన్ను అన్నివిధాలా ఆదుకోవాలి.

– ఖలీల్ మియా, రేగోడ్

'ప్రబీర్' గొప్ప పోరాట యోధుడు

సీనియర్ సిటిజన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొండల్ రెడ్డి



మెదక్‌లో పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

మెదక్ కలెక్టరేట్: భోపాల్ గ్యాస్ లీకేజీ దుర్ఘటనలో బాధితుల తరఫున ప్రబీర్ పుర్కాయస్థ ఎంతో పోరాటం చేశారని సీనియర్ సిటిజన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొండల్ రెడ్డి కొనియాడారు. ప్రముఖ పాత్రికేయులు, న్యూస్ క్లిక్ వ్యవస్థాపకులు, పుస్తక రచయిత ప్రబీర్ రచించిన అలుపెరుగని పోరాటం పుస్తకావిష్కరణ సభ శనివారం మెదక్‌లోని కేవలం కిషన్ భవన్‌లో జరిగింది. బట్టి భూపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రబీర్ పుర్కాయస్థ వృత్తిరీత్యా సాంకేతిక నిపుణుడని, ప్రవృత్తిరీత్యా రాజకీయవేత్త పేర్కొన్నారు. దేశవ్యాప్త సైన్స్ ఉద్యమంలో ప్రబీర్ ముఖ్య వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో టీయూ డబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నాగరాజు, టీయూడబ్ల్యూజే(143) జిల్లా నాయకుడు సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో టీఎస్‌యూటీఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి అన్నారు. శనివారం టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) 11వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా టీఎస్‌యూటీఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం ముందుండి పోరాటం చేస్తుందన్నారు. పండిట్-పీఈటీల పోస్టుల అప్‌గ్రెడేషన్ కోసం, ఉపాధ్యాయులకు పదోన్నతులు, పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యూటీఎఫ్ ఎన్నో పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా కోశాధికారి కృష్ణ, జిల్లా మాజీ అధ్యక్షుడు నగేశ్, జిల్లా కార్యదర్శులు కనకరాజు, గిరిబాబు, శివలింగం, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, శివుడు, తిరుపతి, గణేశ్ రెడ్డి, యాదయ్య, గోవర్ధన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

నిరసన వ్యక్తం చేసిన మత్స్యకారులు

సదాశివపేట(సంగారెడ్డి): ఊబ చెరువు కట్ట కింద కుల దైవమైన కట్టమైసమ్మ మందిరం మీదుగా రహదారి నిర్మించిన సంజీవని లేక్ సిటీ (ప్రాజెక్ట్ రియల్ ఎస్టేట్ బిజినెస్) యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పట్టణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చాపల హన్మంతు, ప్రధాన కార్యదర్శి నల్లశంకర్ డిమాండ్ చేశారు. శనివారం సంజీవని లేక్ సిటీ వెంచర్ వద్ద పట్టణ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంచరు వారు అక్రమంగా కట్టమైసమ్మ మందిరం మీదుగా రహదారిని నిర్మించారన్నారు. కలెక్టర్, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి రైతులు, మత్స్యకారుల జీవితాలను కాపాడడంతోపాటు కట్టమైసమ్మ మందిరాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు నల్ల మల్లేశం, కప్పల రమేశ్, చాపల అనీల్‌కుమార్, చాపల మహేశ్, విజ్జు, నల్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సురేశ్ మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి సిర్గాపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. గైర్హాన్ తండాకు చెందిన విస్లావత్ సురేశ్(30) సిర్గాపూర్‌లో కూరగాయలు, కిరాణం వస్తువులు కొనుగోలు చేసి మోటారు సైకిల్‌పై ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మట్టి కుప్పపై దూసుకెళ్లింది. విస్లావత్ సురేశ్ తలకు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..

కోహీర్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని దిగ్వాల్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దిగ్వాల్ గ్రామ నివాసి డప్పు దేవయ్య(35) శుక్రవారం రాత్రి గ్రామ శివారులోని ప్రిన్స్ బాబా ఎదుట రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. విషయం తెలుసుకొని దేవయ్యను జహీరాబాద్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసేలోపు మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ : నలుగురికి గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని తోటపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని జుగుండ్లకు చెందిన ధర్మేందర్, సంపత్, సంపత్ ముగ్గురు జాతీయ రహదారిపై కరీంనగర్ వైపునకు వెళ్తున్నారు. ఇదే సమయంలో సిద్దిపేట నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. లారీ సైతం అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రులను కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అందని వేతనాలు

గజ్వేల్‌రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భ్యాగరి వేణు పేర్కొన్నారు. మండల పరిధిలోని బెజుగామ, చిన్న ఆరెపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వేసవిలో కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశముందన్నారు. ప్రభుత్వం స్పందించి వారికి సౌకర్యాలను కల్పించడంతోపాటు కూలీ డబ్బులు చెల్లించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు బీభత్సం

- కారు, ఆటో, బైక్‌ను ఢీ
- ఆపై యువకుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి
- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఘటన



బస్సు ముందు భాగంలో ఇరుక్కుపోయిన మహేశ్

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బీభత్సం సృష్టించింది. ఒకేసారి కారు, ఆటో, బైక్‌ను ఢీ కొట్టింది. ఆపై యువకుడిని ఢీ కొట్టడంతో బస్సు ముందు భాగంలో ఇరుక్కొని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా రాజాపూర్‌కు చెందిన మహేశ్(20) పటాన్‌చెరు మండలం పాటీ గ్రామ సమీపంలో ఉంటూ సీసీ రోడ్డు రహదారి నిర్మాణం కార్మికుడి పనిచేస్తున్నాడు. శనివారం పటాన్‌చెరు నోవాపాన్ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు ఈక్రమంలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న వెంకటరమణ ట్రావెల్‌బస్సు అకస్మాత్తుగా బీభత్సం సృష్టించింది. ఒకేసారి కారు, ఆటో, బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం రోడ్డు దాటుతున్న కార్మికుడు మహేశ్‌ను ఢీకొట్టడంతో బస్సు ముందు భాగంలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతర వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. బైక్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బస్సు బ్రేక్ ఫెయిల్ అయ్యి బీభత్సం సృష్టించిందా.. లేక మరో ఇతర కారణమైనా ఉందా.. అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.